19 నామినేషన్ల ఆమోదం

ఎల్లుండితో ఉపసంహరణ గడువు పూర్తి


స్క్రూటినీలో పాల్గొన్న అభ్యర్థులు, అనుచరులు

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియను శుక్రవారం పూర్తి చేశారు. 19 నామినేషన్లు సమగ్రంగా ఉండడంతో ఆర్‌వో శేష శైలజ ఆమోదించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నామినేషన్ ఆమోదం పొందడంతో ప్రత్యామ్నాయంగా నామినేషన్ వేసిన అన్నంరెడ్డి శిరీష నామినేషన్‌ను నిబంధనలకు లోబడి తిరస్కరించారు. దీంతో వైఎస్సార్‌సీపీ పార్టీ తరపున అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కాంగ్రెస్ నుంచి పిరిధి భగత్, జనసేన నుంచి పంచకర్ల రమేష్‌బాబు, బీఎస్పీ నుంచి బంగారి రమణ, పిరమిడ్ పార్టీ నుంచి ఈత రోజ, జై భారత్ జాతీయ పార్టీ నుంచి కన్నెపల్లి మహాదేవ్ కల్యాణ్ శ్రీకాంత్, సమాజ్‌వాది పార్టీ నుంచి బోణం వెంకట మురళి మోహన్, జాతీయ జనశక్తి పార్టీ నుంచి ఏలూరు వెంకటరమణ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి పి.రమేష్‌నాయుడు , ఇండిపెండెంట్లుగా షేక్ షఫీఉల్లా, గుంటూరు వెంకటనరసింహరావు, పంచకర్ల మహాలక్ష్మి, పంచకర్ల వెంకటేశ్వరరావు, వడ్డాది ఉదయ్‌కుమార్, బి.గోవిందరాజు, పొన్నాడ అప్పలనాయుడు, కూండ్రపు సన్యాసిరావు, గుంటూరు సాయి ప్రియ, ఆడారి నాగరాజు నామినేషన్లు ఆమోదించినట్లు ఆర్‌వో వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం వరకూ గడువుందని పేర్కొన్నారు.

జనసేన నాయకుల రాద్ధాంతం

సందర్భం ఏదైనా రాద్ధాంతం చేయడం..నవ్వులపాలు కావడం జనసేన నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నామినేషన్ విషయంలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, అతని సోదరుడు వెంకటేశ్వరరావు, అనుచరులు అవగాహన రాహిత్యంతో అభ్యంతరం తెలిపి అభాసుపాలయ్యారు. నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోని చిన్న విషయంపై శుక్రవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అధికారుల సమయాన్ని వృథా చేశారు.

వివరాలు.. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నామినేషన్ వేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన కావడంతో అభ్యర్థులు, అనుచరుల సమక్షంలో ఆర్‌వో శేష శైలజ ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నామినేషన్ పరిశీలన చేస్తున్న సమయంలో జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, మిగిలిన ఏజెంట్లు అదీప్‌రాజ్‌పై కేసుల విషయంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా పోరాటంలో భాగంగా పెందుర్తిలో రైల్ రోకో నిర్వహించిన సమయంలో, సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్య పరిష్కారం కోసం నిరాహార దీక్ష చేసిన సమయంలో నమోదైన కేసుల వివరాలను అదీప్‌రాజ్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయితే ఆయా కేసులు కోర్టు పరిధిలోకి వెళ్లిన తేదీని అందులో నమోదు చేయలేదు. ఆర్వో పరిధిలో మినహాయింపు ఇచ్చే ఈ విషయంలో జనసేన నాయకులు రాద్ధాంతం ప్రారంభించారు. ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు నానా హంగామా చేశారు. నిబంధనల ప్రకారం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నా వినకుండా మూర్ఖంగా అదీప్‌రాజ్ నామినేషన్‌ను తిరస్కరించాలని ఆర్‌వోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో ఆర్వో విచారణకు ఇరు పక్షాలకు కబురు పెట్టారు. అయితే సాయంత్రం 4 గంటలకు ఆర్వో నుంచి జనసేన నాయకులకు సమాచారం వెళ్లినా రాత్రి 7 గంటల వరకు వారు రాకపోవడంతో అదీప్‌రాజ్ నామినేషన్ ఆమోదిస్తున్నట్లు ఆర్వో శేష శైలజ అధికారికంగా ప్రకటించారు. అవగాహన రాహిత్యంతో అధికారుల విలువైన సమయాన్ని వృథా చేయడంతో పాటు ఫిర్యాదు చేసిన తర్వాత విచారణకు పిలిస్తే జనసేన నాయకులు గైర్హాజరు కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట


అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం: మండలం కేంద్రం సబ్బవరం రామాలయం సమీపంలో అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు.మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

సకాలంలో రిటర్న్స్ దాఖలు చేయాలి


సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు

పరవాడ: పరిశ్రమల శాఖకు సమర్పించాల్సిన రిటర్న్స్‌ను పరిశ్రమల ప్రతినిధులు ఏటా సకాలంలో అందించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు సూచించారు. రాంకీ కమర్షియల్ హబ్‌లో శుక్రవారం రిటర్న్స్‌పై పరిశ్రమల ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పలు అంశాలను చిన్నారావు విపులంగా వివరించారు. పరిశ్రమల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ముందుముందు ఇటువంటి సదస్సుల నిర్వహించడం ద్వారా యువ ప్రతినిధులకు మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఫార్మాసిటీలో నిర్వహించిన అవగాహన సదస్సులో 157 మంది పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చకచకా


ఆరిపాకలో చురుగ్గా సాగుతున్న సీసీ డ్రైన్ల పనులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.3 లక్షలతో వాటర్ ట్యాంక్ నుంచి సింగంపల్లి రమణ ఇంటి వరకూ సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో ఆరిపాక మెయిన్ రోడ్డు నుంచి వాటర్ ట్యాంకు వరకూ సీసీ డ్రైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

- వాటర్ ట్యాంక్ వద్ద రూ.2.7 లక్షల గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ ప్లాట్ ఫాం పనులు చేపడుతున్నారు.
- ఆరిపాక శ్మశాన వాటిక వద్ద రూ.1.5 లక్షల పంచాయతీ నిధులతో బోర్ వెల్ ఏర్పాటు చేశారు.
- రూ.1.15 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో వాటర్ ట్యాంకు నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకూ పైపు లైన్ పునరుద్ధరించారు.

నేడు 'సామాజికం' సీఎస్సార్-2024 సదస్సు

దాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 'సామాజికం'సీఎస్సార్-2024 సదస్సు విశాఖలో ఈ నెల 27న నిర్వహించనున్నట్టు రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సీఏ డి. మధుసూదనరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ ఇంటర్నేషనల్ విశాఖపట్నం ఆధ్వర్యంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు నేతృత్వంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. హోటల్ నోవాటెల్ వేదికగా శనివారం సాయంత్రం నిర్వహించనున్న సీఎస్సార్ సదస్సులో ముఖ్యంగా సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిరుపేద మహిళలు, చిన్నారులు, అనాథలకు సహాయ సహకారాలు అందివ్వడమే లక్ష్యంగా సదస్సు ఉంటుందన్నారు.

నేడు మండలంలో అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు తెలిపారు. బంగారమ్మపాలెం, ఆర్‌పీ అగ్రహారం, నల్లరేగులపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఎన్నికల ప్రచారం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,అభిమానులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

26 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: నాయుడుపాలెం, గొల్లలపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు వైన్ షాపుల నుంచి అక్రమంగా తరలిస్తున్న 26 మద్యం సీసాలను ఎస్ఐ టి.మల్లేశ్వరరావు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. నాయుడుపాలెం గ్రామానికి చెందిన కె.గురుమూర్తి వైన్ షాపు నుంచి 20 మద్యం సీసాలు (180ఎంఎల్), గొల్లలపాలేనికి చెందిన వియ్యపు అప్పారావు వైన్ షాపు నుంచి 6 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

క్విజ్ పోటీలతో విజ్ఞాన వికాసం


క్విజ్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా


విన్యాసాలను ప్రదర్శిస్తున్న యువత

ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ: క్విజ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా జ్ఞాన వికాసంతో మేధాశక్తి పెరుగుతుందని ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ కుటుంబ సభ్యులకు ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాంతీయ స్థాయి మేధా ప్రతియోగిత పవర్ క్విజ్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్టీపీసీ కుటుంబ సభ్యులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ క్విజ్ పోటీలు సువర్ణావకాశమన్నారు. ఉద్యోగుల విభాగంలో 4 కేటగిరీల కింద నిర్వహించిన పోటీల్లో దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయంతో పాటు వివిధ ప్రాజెక్టుల్లో 6 బృందాలు పాల్గొన్నాయి.

ఇక్కడ విజేతలు మే నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బి.బి.పాత్ర(హెచ్‌ఆర్ హెడ్), పలువురు అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఆన్‌లైన్‌లో పూజ కోసం గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు పంపించాలి.

29 నుంచి పెదముషిడివాడ పైడిమాంబ ఉత్సవాలు


పైడిమాంబ అమ్మవారు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నట్టు పైడిమాంబ ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా (కబడ్డీ) అప్పారావు తెలిపారు. గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 29న ఉత్సవాలు ప్రారంభమై 30వ తేదిన ముగుస్తాయని చెప్పారు. మంగళవారం వేకువ జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో షామియానాలు, బారికేడ్లు, మంచినీరు, మజ్జిగ, ఉచిత ప్రసాద ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం రాత్రికి గ్రామంలో డ్యాన్స్ బేబీ డాన్స్, లక్కీ ఈవెంట్స్, ఎస్సీ కాలనీలో డ్యాన్స్‌బేబీడాన్స్, ఎలిమెంటరీ స్కూల్ వద్ద సినీడూప్స్, అమ్మవారి గుడివద్ద బిందెల డ్యాన్స్, కోనేం గట్టు వద్ద సినీడూప్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనుపు రోజు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయి గుర్రపు స్వారీ ప్రదర్శన ఉంటుంది. ఈ ప్రదర్శనలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో, ఐదో, ఆరో బహుమతి కింద రూ.20 వేలు, 15 వేలు, 12వేలు, 10 వేలు, 8వేలు, 6 వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. మంగళవారం రాత్రికి డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, మేదరబండి, బండ్ల వేషాలు, చిడతలు, నేల డ్యాన్సులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి అనుపు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుతామని ఉత్సవ కమిటీ చైర్మన్ కబడ్డీ అప్పారావు చెప్పారు.

'గురుకులం'.. ప్రగతి పథం

- శతశాతం ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత
- రికార్డు సృష్టించిన తానాం గురుకులం
- సౌకర్యాలే సత్ఫలిచ్చాయని కితాబు

పదో తరగతిలో గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రగతి సాధించారు. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు దీటుగా సత్తా చాటారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి కార్పొరేట్‌కు ప్రాధాన్యమిస్తే .. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాల్లో కోట్లాది రూపాయలతో సకల సౌకర్యాలు కల్పించింది. అత్యున్నత ప్రమాణాలతో బోధనకు ప్రాధాన్యం ఇచ్చింది. విద్యార్థులు వాటిని వినియోగించుకుని ప్రతిభ కనబరిచారు. తానాం గురుకుల పాఠశాల విద్యార్థులంతా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.



తానాం గురుకుల పాఠశాల

పరవాడ: తానాంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రికార్డు సృష్టించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 80 మంది బాలికలు హాజరు కాగా 80 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. గురుకుల పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన వసతులతో పాటు ఉపాధ్యాయుల కృషి ఫలించింది. విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టులపై పట్టు పెరిగే విధంగా తీర్చిదిద్దారు. పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపారు. వారిలో చదువు పట్ల మరింత పట్టుదల పెరిగే విధంగా పాఠాలు బోధించి పరీక్షల్లో రాణించడానికి కృషి చేశారు.

సబ్జెక్టుల వారీగా అధిక మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య

సబ్జెక్టు	మార్కులు	విద్యార్థులు
తెలుగు	99	6
హిందీ	97	1
ఇంగ్లీష్	99	2
లెక్కలు	100	3
	99	2
సైన్స్	100	1
	99	2
సోషల్	100	9
	99	6

పోలీసు అధికారినవుతా



మాది బుచ్చెయ్యపేట. వ్యవసాయ కుటుంబం. మా తండ్రి పాతం శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తారు. తల్లి సుజాత గృహిణి. నేను పది తరగతిలో 586 మార్కులు సాధించడం గర్వంగా ఉంది. మంచి చదువులు చదివి పోలీసు అధికారిగా ప్రజలకు సేవా చేయాలన్నదే నా లక్ష్యం.

– పి.దివ్య, తానాం గురుకుల పాఠశాల

సివిల్స్ సాధిస్తా..



మాది బుచ్చెయ్యపేట గ్రామం. మా తండ్రి నాయుడు, తల్లి లోవమ్మ. వ్యవసాయం చేస్తుంటారు. మేం ముగ్గురు సంతానం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించాను. ఉన్నత చదువులు చదవాలని ఉంది. ముఖ్యమంగా సివిల్స్ సాధించి సేవ చేయాలని ఉంది.

– ఎస్.ఝాన్సీ, తానాం గురుకుల పాఠశాల

ఐఏఎస్ అవుతా



మాది అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం. మా తండ్రి గెడ్డం నాగరాజు ఆటో డ్రైవర్. పదో తరగతిలో మంచి మార్కులు సాధించడానికి పాఠశాల ఉపాధ్యాయులే కారణం. ట్రిపుల్ ఐటీలో చేరి పట్టుదలతో చదివి ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

– జి.సాయి చందన, తానాం గురుకుల పాఠశాల

చార్టెడ్ అకౌంటెంట్ అవుతా



మాది శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం మల్లేస్‌పేట. తండ్రి రామచంద్రరావు, తల్లి సీతారత్నం వ్యవసాయం చేస్తారు. మేం ఇద్దరు సంతానం. చెల్లి హేమశ్రీ 9వ తరగతి చదువుతుంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో పట్టుదలగా చదివా. ముందుముందు ఉన్నత చదువుల్లో రాణిస్తా. ఎంఈసీ సబ్జెక్టు తీసుకొని చార్టెడ్ అకౌంటెంట్‌గా రాణిస్తా.

– ఐ.చేతన, తానాం గురుకుల పాఠశాల

సమష్టి కృషితో శతశాతం ఫలితాలు



తానాం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు కృషికి విద్యార్థుల పట్టుదల తోడవంతో శతశాతం ఫలితాలు వచ్చాయి. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించే విధంగా తీర్చిదిద్దాం. పాఠశాల నుంచి 80 మంది పరీక్షలకు హాజరైతే 80 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి జిల్లాలో గురుకుల పాఠశాల గౌరవాన్ని మరింత పెంచారు.

– ఎం.అప్పలనాయుడు, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, తానాం

కంటైనర్ తగిలి విరిగిపడిన చెట్టుకొమ్మ


సబ్‌స్టేషన్ కూడలిలో విరిగిపడిన చెట్టుకొమ్మ

పరవాడ: పరవాడ–గాజువాక రహదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై శుక్రవారం రాత్రి చెట్టు కొమ్మ విరిగి పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ కంటైనర్ పరవాడ మీదుగా లంకెలపాలెం వైపు వెళ్లాల్సి ఉంది. అయితే దారి తప్పడంతో డ్రైవర్ గాజువాక వైపు వెళ్లడానికి ప్రయత్నించడంతో ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ కూడలిలోని భారీ మర్రి చెట్టు దిగువ నుంచి వెళుతున్న క్రమంలో చెట్టు కొమ్మ తగలింది. అప్పటికే దెబ్బతిన్న చెట్టుకొమ్మ ఉన్నట్టుండి విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో ఇరువైపుల నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానికులు కొందరు స్పందించి చెట్టు కొమ్మలను ముక్కలుగా నరికి పైకి తీశారు. దీంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆర్ఎల్‌సీకి ఫిర్యాదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ కేంద్ర రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ)కు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి స్టీల్‌ప్లాంట్ చెల్లించే విద్యుత్ చార్జీలను టౌన్‌షిప్ క్వార్టర్లలో ఉండే ఉద్యోగులు కూడా చెల్లించాలని ఇటీవల యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో గుర్తింపు యూనియన్ ఈ మేరకు ఫిర్యాదు చేసింది. త్రైపాక్షిక ఒప్పందం మేరకు రాయితీతో కూడిన విద్యుత్ చార్జీలు తీసుకుంటున్నారని తెలిపారు. యాజమాన్యం కార్మిక సంఘాలతో ఎటువంటి చర్చలు లేకుండా ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ అంశంపై యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని యూనియన్ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలే ఆయువుపట్టు


మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు రామస్వామి

అగనంపూడి: దేశానికి ఆయువుపట్టు వంటి ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు యు.రామస్వామి అన్నారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1170వ రోజు ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వరంగ సంస్థను కేంద్రం అమ్మజూపితే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఘటించాలని కోరారు. లేకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, వ్యతిరేక విధానాలు గొడ్డలిపెట్టు వంటివన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఒకరిద్దరి చేతుల్లో పెట్టాలనుకుంటే ఉప్పెన తప్పదని, ఆ ఉప్పెనలో కేంద్ర పాలకులు కొట్టుకుపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను శుక్రవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఉక్కు పరిశ్రమలో సొంతంగా విద్యుత్ తయారు చేసుకోవడం వల్ల అందులో పనిచేసే ఉద్యోగులకు రాయితీతో కూడిన విద్యుత్ ఇవ్వడానికి జాతీయ స్థాయి ఉక్కు పరిశ్రమలో ఒప్పందం జరిగిందన్నారు. అయితే యాజమాన్యం ఆ ఒప్పందానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించే చార్జీలను చెల్లించాలంటూ జారీ చేసిన ఉత్తర్వులు అన్యాయమన్నారు. వెంటనే ఆ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, దేముడు, ఎస్.ఎ.నాయుడు, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఆర్‌లో పీజీ డిప్లొమా కోర్సు


కోర్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మేథో హక్కులపై పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించారు. ఈ మేరకు బ్రోచర్‌ను అంతర్జాతీయ మేథో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏయూ సెనేట్ మందిరంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అత్యధికంగా పేటెంట్లు సాధించిన ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, టి కాబ్స్ ఈ నిర్వాహకులు వై.రవికిరణ్, ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డిలను సత్కరించారు. అంతర్జాతీయ మేథో హక్కుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలను ఈ సందర్భంగా ప్రకటించారు. మాజీ వీసీలు ఆచార్య బీల సత్యనారాయణ, ఆచార్య జి.ఎస్.ఎన్ రాజు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

లింగ వివక్షపై పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆచార్యులు కె.రాజమాణిక్యం రచించిన బియాండ్ ట్రెడిషన్స్- భామస్ దళిత ఫెమినిజం అండ్ ద ఛాలెంజ్ డిస్పారిటీస్ ఇన్ సౌత్ ఇండియన్ సొసైటీ౹పుస్తకాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య వినుత, తదితరులు పాల్గొన్నారు. దక్షిణ భారతదేశంలో లింగ అసమానతలను నిశితంగా పరిశీలించి అధ్యయనం చేసి దానిపై సమగ్ర వివరాలతో రూపొందించిన పుస్తకంగా ఇది నిలుస్తుందని రచయిత రాజమాణిక్యం తెలిపారు. భారతీయ దళిత స్త్రీల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాలని తెలిపేలా ఉంటుందన్నారు.